# ఇదో ప్రేమకథ

★

* శ్రీ భద్రాచలం శశితేజ్ *



రచయిత

బెరహంపూర్‌లో అడుగు పెట్టేసరికి సరిగ్గా రెండు దాటింది. ఆంధ్రలోనే కాదు. సూర్యుడు తన ప్రతాపం ఒరిస్సాలోనూ చూపిస్తున్నాడు. ఆ ఎండలో ఈసురోమనుకుంటూ లగేజితో రూమ్‌కి చేరిన తర్వాతగాని కాస్తా ప్రాణం వచ్చినట్టయింది జవహర్‌కి.

అన్నట్టు మనవాడు అక్కడికెందుకు వెళ్ళాడనుకుంటున్నారా? దాని వెనక ఓ చిన్న సినిమాకి సరిపోయే స్టోరీ వుంది. నిజానికి బెరహంపూర్‌లో ఆంధ్రులు గణనీయమైన సంఖ్యలోనే వున్నారు. వ్యాపారరీత్యా అయితేనేమి, ఇంకా ఇతర వృత్తుల నిమిత్తమైతేనేమి తర తరాలుగా స్థిరపడిన వాళ్ళు చాల మంది కనిపిస్తారక్కడ. కావడానికి ఒరిస్సాలోని ప్రాంతమే అయినా తెలుగు వాతావరణం అంతటా అగపడుతుంది.

ఓ మధ్యతరగతికి చెందిన స్కూలు మాష్టారి చివరి సంతానం జవహర్. ఆ పేరు పెట్టడాన్ని బట్టి దేశభక్తి అంతో ఇంతో వున్న కుటుంబము నుండి వచ్చిన వాడన్న సంగతి ఎవరికైన తెలుస్తుంది.

నిజానికి భారతదేశంలో అత్యున్నతమైన ఆలోచనాపరులుగా గణింపబడేది ఈ తరగతికి చెందినవారే! అది మన సామాజిక వ్యవస్థని పరిణామక్రమంలో ఒక దశ.

ఖమ్మం ప్రభుత్వ కాలేజిలో డిగ్రీ చదివిన తర్వాత ఓ సంవత్సరల ఖాళీగావున్న జవహర్‌కి సరికొత్త అనుభవాలు ఎదురు కాసాగాయి.

కనబడ్డ ప్రతి ఉద్యోగానికి అప్లయి చెయ్యడము, పరీక్ష రాసి రావడము, మళ్ళీ దాని విషయం ఏదీ తెలియక పోవడము ఇదంతా నిత్యకృత్యాల్లో ఓ భాగమై పోయింది.

'వాడు శ్రద్ధగా చదివి రాస్తే ఎందుకు రాదు మంచి రిజల్టు? ఏదో ఊళ్ళు తిరగడానికి వెళుతున్నాడే తప్ప వీడికి ఉద్యోగం సంపాదిద్దామన్న ధ్యాస వుంటేగా!' అంటూ నాన్న ఈసడింపు.

'తీరగా బజాళ్లన్నింటినీ సర్వే చేసి యింటికి రాగానే పెట్టడానికి అమ్మ, నాన్న లున్నారుగా ఆయనకేం బాధలెండి' అంటూ వదిన వేళాకోళం.

ఈ అవమానాల్ని యింట్లో నుండే కాదు బయటి నుండి కూడా ఎదుర్కోవలసి వస్తుండేది. 'అన్నట్టు మీ అబ్బాయికి డిగ్రీ అయిందిటగా ఇప్పుడేం చేస్తున్నాడు?' అంటూ పొరుగింటి వాళ్ళు తనింట్లో ఉన్నప్పుడు తల్లి మర్చిపోయిందేమోనని గుర్తు చేయడం!

వీటన్నిటికీ పుల్‌స్టాప్‌లా ఓరోజు ఒక కవరు వచ్చింది. ఈ బెల్లాంటి మాటల్ని కొన్నాళ్ళయినా తప్పించుకునే దారి అది. బెరహంపూర్‌లో బి.యిడి.సీటు రిజర్వు చేసి వుంచామని నువ్వు వచ్చి తగు పైకం కట్టి చేరడమే ఆలశ్యమని దాని సారాంశం.

మొదట్లో యింట్లో అంత డబ్బు ఎందుకు అని మొరాయించినా బి.యిడి. అయితే త్వరగా ఉద్యోగంలో చేరేం

దుకు ఓ ఆయుధంలా వుపయోగ పడుతుందని ఎలాగో తంటాలు పడి డబ్బు సర్దారు.

ఇక జవహర్ జీవితంలో కొత్త అధ్యాయం మొదలయింది. అన్యరాష్ట్రం-ఆహ్లాదకరమైన వాతావరణం చాల బాగా నచ్చాయి. వాళ్ళ కాలేజి పేరు RCM కాలేజి అంటే రాణి చంద్రమతి కాలేజి.

స్వేచ్ఛాయుతమైన జీవితం, తనతో బాటు ఇంకొందరు ఆంధ్రా స్టూడెంట్సు కూడా వున్నారు. అయితే ఆంధ్రుడే ఆంధ్రుడికి శత్రువు అన్న సంగతి అక్షరాల నిజం చేసిన చరిత్ర వాళ్ళది.

కేరళ, తమిళనాడు రాష్ట్రాలకి చెందినవాళ్ళే కాక ఉత్తరాది వాళ్లుకూడా బాగానే వున్నారు. క్లాసులో ఒరియావాళ్లే మైనారిటీలు, అదిచూసి వాళ్లు ఉడుక్కునే వాళ్ళు. దక్షిణాది వాళ్ళంతా ఒక మాటగా వుండేవారు కాలేజికి సంబంధించి.

'మిస్ మంజుగుప్తా ఈ రోజు కాలేజికి రాలేదా?' ఒక స్టూడెంట్ ఇంకొకడిని అడుగుతున్నాడు.

'భలేవాడివే! గొప్ప వ్యక్తులు ఎవరూ సమయానికి రారు తెలుసా?' నవ్వుతూ బదులిచ్చాడు. ఇంతలో అయాసంగా ఓ ఒరియా స్టూడెంటు వచ్చి 'మంజుగుప్తా వచ్చేస్తోంది. అందరూ రెడీగా వుండండి' అంటూ ముందు జాగ్రత్తగా చెప్పడంతో మిగతా ఇద్దరూ చెరిగిన క్రాపులు దువ్వుకో సాగారు.

బుక్స్ తీసుకొని ఆటోలోనించి దిగింది మంజు. ఆమె తండ్రి ముఖేష్ గుప్తా ఆర్మీలో బ్రిగేడియర్. ఉద్యోగం కోసం ఈ చదువు చదవాల్సిన అవసరం లేకపోయినా బోధనా వృత్తిపై ఆమెకున్న ప్రత్యేకాభిమానం దీంట్లో చేరేలా చేసింది.

తనవైపే ఆవురావురుమంటూ చూస్తున్న ఆ జీవుల పైపు టీజ్ చేస్తున్నట్లు ఓ చిరునవ్వు విసిరేసి చకచకా సాగిపోసాగింది. ఆ నవ్వుకి వాళ్లు ఎన్నెన్ని అర్థాలు కల్పించుకొని ఎంత హైరానా పడిపోతారో ఊహించుకొని లోలోనే మళ్ళీ నవ్వుకుంది మంజు.

క్లాసులో లెక్చరర్ చెపుతున్నదేమిటో ఎవరికి సరిగా వినపడ్డం లేదుగాని మంజు తన స్నేహితురాళ్ళతో వెనక బెంచిలో గుసగుసగా ఏం చెబుతుందో మాత్రం అందరికీ వినపడుతోంది ముఖ్యంగా మగ స్టూడెంట్స్‌కి. ఆ తప్పు వాళ్ళది కాదు; రెప్ప కూడా వేయాలనిపించని సౌందర్యం తన సొంతం చేసుకున్న మంజుదే!


''క థా ం జ లి'' జన్మదిన సంచికకు మా శుభాకాంక్షలు !



కావలెను

మా చేత తయారించు అత్యుత్తమమైన జంకాళాలు, బెడ్ షీట్లకు ఆర్డరు బుక్ చేయుటకు కొత్త కమిషన్ ఎజెంట్లు కావలెను.

మీకు కావలసిన వాటికి మా అధికారం పొందియున్న ఏజెంట్ల వద్ద ఆర్డరివ్వండి

—: Mfrs :—

Phone : 2261

Nandakumar Industrials

P. B. No. 57 : . BHAVANI-638 302.

అందుకే మిగతా ఆడవాళ్ళకి మంజు అంటేనే వళ్ళు మంట. ఆమె వచ్చేసరికి తమతో మాట్లాడుతున్న వాళ్ళు సడెన్‌గా ఆమెతో ఏదో సంభాషించాలని వెళ్ళిపోతుంటారు.

అయితే వాటన్నిటికి అతీతుడు మన జవహర్. క్లాసులో గాని, బయటగాని ఏ ఆడపిల్ల వంకా చూసినట్టు కనబడడు. ఎంతో అవసరమైతే తప్ప రెండుముక్కలు మాట్లాడతాడు. చాల మంది అమ్మాయిలు అతడితో స్నేహం చేయాలని ఉవ్విళ్ళూరుతుంటారు. ఆంధ్రులు కూడా అందమైన పరస నాలిటి. దానికి తగ్గ గుణం గలవారే ననడానికి జవహర్ ఓ ఉదాహరణ కావడం దానికి కారణం కావచ్చు.

ఈ మూడు గుణాలు మంజు గమనిస్తూనే వుంది... అందుకే అతడు కనపడినప్పుడల్లా అడ్మైరింగ్‌గా చూస్తూ వుంది. అది అర్థం చేసుకోలేనంత అమాయకుడు కాక పోయినా 'సమయం యింకా రాలేదు' అనుకొనే వాడు తనలో తను.

'మంజుకి నువ్వంటే చాలా అభిమానం గురూ!' ఆ మాటకి నివ్వెరపడి స్నేహితుడి ముఖంలోకి చూశాడు జవహర్.

'అవును. మొన్న మంజుతో ఆమె స్నేహితురాలు ఒకామె నువ్వు క్లాసులో అమ్మాయిలతో సరిగా మాట్లాడ కుండా వుంటావని యిలా అయితే దేశ జనాభాని అతికట్ట డంలో బాగా సాయం చేస్తావని జోక్ చేస్తూంటే... అప్పుడు ఏమందో తెలుసా?'

'ఏమందేమిటి?' కొంచెం ఆసక్తిగా అడిగాడు.

'ఇంకోసారి ఎప్పుడైనా ఆతడిపైనా జోక్‌వేస్తే సహిం చను' అంటూ స్పీడుగా వెళ్ళిపోయింది బాస్. 'ప్రేమ అనేది నిజంగా ఓ మొక్క లాంటిదే! స్నేహితులు మరిన్ని నీళ్ళు పోయాలేగాని ఆ సహకారంతో ఇంకొంచెం ఎత్తు ఎదుగుతుంది సరిగ్గా జవహర్ విషయంలోనూ అదే జరి గింది. బయటికి మాత్రం సీరియస్‌గా ముఖం పెట్టి స్నేహి తులతో 'అదంతా ప్రేమేనంటారా?...' సందేహంగా అడిగాడు.

'నువ్వు ఇదే అదనుగా ప్రోసీడ్ జావాలి. లేకపోతే బండి వేరే స్టేషన్‌కి పోతుంది. పైగా ఉత్తరప్రదేశ్ బండి ఆది.'

ఆ మాటలతో జవహర్‌లో ఎక్కడో వున్న ఇంకొక జవహర్ వళ్ళు విరుచుకున్నాడు. మంజులాంటి అందమైన పిల్ల తనని అంతగా అభిమానిస్తూంటే తాను మౌనిలా పడి ఉండటం పిచ్చితనమే అవుతుంది. ఔను...తన ఫ్రెండ్స్ ఎంత మంచివారు...ఇంత మంచి వార్త చెప్పేరు...అను కొంటూండగా చెట్టుమీద ఏ కొమ్మమీద వుందో గాని ఓ పిచుక సరిగ్గా నెత్తిమీద రెట్టవేసింది.

O O O

మహంతా సైకాలజి లెక్చరర్. అయన సైకాలజి కను క్కోవడం ఎవరి తరమూ కాదు. అందుకే ఆ డిపార్ట్ మెంటుకి వెళ్ళాదేమో అంటుంటారు కొలీగ్స్. స్టూడెంట్సుకి మాత్రం ఓ టైమ్‌పాస్ బఠాణీ అతడు. 'నేనీ పాటికి ఈ కాలేజి ప్రిన్సిపాల్ కావలసిందోయ్' అంటాడొ కసారి. 'అసలు ఈ వెధవ ఉద్యోగం నాకో లెక్క గాదు మా మహంతాలకి వుండే మేధస్సు ముందు ఈ డిగ్రీల చదువులె ందుకు? ఈ కొలువు లెందుకు? అంటాడు మరోసారి.

మహంతా జవహర్‌ని చూస్తూనే ఓరకంగా కళ్లు చిట్లించి అంతలోనే ఏదో తట్టినవాడిలా 'హలో, జవహర్! ఓసారి ఇలా రావోయ్' అంటూ పిలిచాడు. ఏ మాట కా మాట చెప్పాలి. అదేమిటో గాని ఆయనకి చచ్చేంత జ్ఞాపక శక్తి. ఒకోసారి అది ఇతరుల్ని కష్టాల్లో కూడా పడేస్తుంది.

'ఏమిటి సార్!' అంటూ వెనక్కి మళ్ళాడు. దగ్గర కొచ్చిన జవహర్‌ని మరోసారి పరీక్షగా చూస్తూ 'యస్... ఐయామ్ ఆల్‌వేస్ రైట్' అన్నాడు మహంతా. 'దేనికి సార్!' కొద్ది భయం నటించాడు జవహర్.

'నిజంగా చెప్పు! నాతో అబద్ధాలాడకు! మహంతాలతో అబద్ధమాడితే మతులు గతులు తప్పుతాయి.' ఆయన దోరణికి బిత్తరపోయాడు జవహర్.

'మీరనేది ఏమిటో బొత్తిగా అర్థం కావడం లేదుసార్' చిన్నగా అడిగాడు.

'నీకూ, మంజుగుప్తాకి గల సంబంధం ఏమిటి?'

ఆ ప్రశ్నతో నిజంగానే మతి పోగొట్టాడు మహంతా. ఏమి జరుగుతోంది?

అసలేమిటి ఇదంతా! మనసంతా మట్టిగడ్డలా అయింది.

ఏం చెప్పాలో అర్థం కావడంలేదు! అయినా ఈ మహంతాకి ఇంత అవసరం ఏమిటి?

'ఆమె...గూర్చి నాకు ఎక్కువగా ఏం తెలీదు సార్! పేరు మాత్రం విన్నాను అంతే.'

'అదిగో ... మళ్ళీ మహంతాలతో అబద్ధం ... పోనీ ఆమెకి నువ్వు తెలుసన్న సంగతి నీకు తెలుసా?'

'అది ...అంతగా తెలీదు సార్' నసుగుతూ చెప్పాడు జవహర్.

'అబ్బ...ఏం యంగ్ జనరేషనయ్యా బాబూ? లవ్ చేశానని చెప్పడానికి కూడా భయమయితే ఇక నువ్వు భవిష్యత్తులో ఏం బాగుపడతావు?'

'సార్...ఏమిటి...మీరనేది?...' ఆశ్చర్య పోవడం జవహర్ వంతయింది.

'లేకపోతే ఏమిటి? నిన్న మంజు నోట్సుని చెక్ చేస్తున్నాను. చివరిపేజీని ఎందుకో పొరపాటున తీశా! అక్కడేముందో తెలుసా? ఐ లవ్ జవహర్, నెం. 18 అంటూ చాల పర్టిక్యులర్‌గా రాసిందయ్యా!'

జవహర్‌కి ఇప్పుడేమీ వినబడటం లేదు. అసలు ముందు సైకాలజీ లెక్చరరే కనపడటం లేదు. పరిస్థితి గమనించి ఆయన నిష్క్రమించాడు.

'మంజుగుప్తా' తనని అంతా గాఢంగా ప్రేమిస్తుందా? తనని మరచిపోలేక నోట్సులపై కూడా రాసుకునే స్టేజికి వచ్చేసిందా? చివరికి తన నెంబరు కూడా గుర్తు పెట్టుకుంది. అంటే...ఇక...అవును...ఆలశ్యం చేయకూడదు. వెంటనే మంజుని చూడాలి. ఏవేవో చెప్పాలి ఇంక ఎప్పటికీ ఆమెతోనే వుండాలి. బంగారుచ్ఛాయతో మెరిసే ఆమె భుజాలపై చేతులేసి అలా అలా షికార్లు చేస్తూ—భూలోక స్వర్గాన్ని చేరాలి.

X X X

అతడి ఊహలు కల్లలు కాలేదు. రతీమన్మథుల్లా చెట్టాపట్టా లేసుకుని బ్రహ్మంపూర్ వీధుల్లో ఎన్నో కబుర్లు చెప్పుకున్నారు. తమని తలవని తలంపుగా కలిపిన సైకాలజీ లెక్చరర్ జ్ఞాపకశక్తికి పదే పదే కృతజ్ఞతలు చెప్పుకున్నారు మనసులోనే!

With best compliments from :

Phone : 26065 Tel. : "SANTHI STAR"

**Santhi Diamonds**

Props : B. K. N. KANNAN & SONS.

37, Big Sowrastra Street, TIRUCHIRAPALLI - 620 008.

శాంతి వజ్రములు

మేము అత్యుత్తమైన పెర్లీన్ స్టార్ డబుల్ కటింగ్

శాంతి స్టార్ కమలములు మీ నగలకు అతి ప్రకాశాన్నిచ్చే రీతిగా

తయారిస్తున్నాము.

రసాయనిక వజ్రాలను తయారించుటలో

మాదొక ప్రత్యేకత

'సాధ్యమైనంత తొందరగా పెళ్ళి చేసుకుందాం!' అనేది మంజు.

'కానీ ఆ పైన ప్రేమని తింటూ—' అంటూండగావే అతడి నోటిని మూస్తూ 'అప్పుడు నేను ఉద్యోగం చేస్తాను. నువ్వు యింట్లోనే ఉండు హాయిగా!' అంది.

'ఉంతొచ్చు, కానీ సెన్సెస్‌ని మళ్ళీ మధ్యలో కండక్ట్ చేయడం ప్రభుత్వానికి కాస్తా యిబ్బందిగా వుంటుంది.' ఆ మాటకి ఊపిరాడని విధంగా నవ్వుకున్నారిద్దరూ.

ఓ రోజు వాళ్ళ ఇంటికి తీసుకెళ్ళి తన తల్లిదండ్రులను పరిచయం చేసింది. వాళ్ళు చాల వార్మ్‌గా ట్రీట్ చేశారు. మంజుతో పెళ్ళయితే ఆంధ్రలో వుండాలా? లేక నార్త్‌లో వుండాలా ఆలోచించుకుంటూండగా 'హలో!' అన్న మంజు పిలుపుతో ఇహలోకంలోకి వచ్చి చిద్విలాసంగా నవ్వుతున్న ఆమె చేతిలోని 'టీ' తీసుకున్నాడు. ఏ పని చేస్తూన్నా, ఎక్కడికెళ్ళినా అంతటా మంజునే! ఎప్పుడూ భవిష్యత్తు ఎలా ఉంటుందోనన్న ఆలోనలలే! చిత్రంగా తన తల్లిదండ్రులు ఈ హిందీ అమ్మాయిని కోడలిగా అంగీకరిస్తారా? లేదా? అనేది తను ఆలోచించడం లేదు. అవసరమయితే వాళ్ళనే కాదనుకుంటాడు తను.

ఓ రోజు కాలేజికి ఆటోలో జంటగా దిగిన జవహర్ మంజుని ఆంధ్రా స్టూడెంట్సు చూడనే చూశారు. పోనీలే మన రాష్ట్రంవాడు కదా అని ఏదో ఎంకరేజ్ చేస్తే వీడు నిజంగానే మంజుని పట్టేశాడే అనుకున్నారు లోలోపల. బయటికి మాత్రం 'కంగ్రాట్స్ బాస్, తెలుగువాడినని పించావు! ఇంతమంది వున్న ఈ కాలేజిలో మంజూ నిన్నే లవ్ చేయడం గ్రేట్' అంటూ ఊదరగొట్టారు. మనవాడు సిగ్గుతో మెలికలు తిరిగి పోయాడు. ఇప్పుడు కాలేజికి రావడమంటే జవహర్‌కి స్వర్గానికి రావడంలా వుంది. ఓ రోజు మంజు కాలేజికి రాలేదు, మనసంతా కకావికలయింది. ఏమైవుంటుంది? వంట్లో బాగోలేదేమో? పరిపరి విధాలుగా ఆలోచించసాగాడు

(సశేషం)

With best compliments from :




Phone : 24010
9, K. N. P. Colony
Dharapuram Road,
TIRUPUR-638 603.